క్లుప్తంగా

కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: తెలంగాణ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మల్‌రెడ్డి రాంరెడ్డిని మంగళవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

బాధిత కుటుంబసభ్యులకు పరామర్శ

శంకర్‌పల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పెంటయ్య(60) కుటుంబాన్ని మంగళవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి పరామర్శించారు. అనంతరం పెంటయ్యతో ఉన్న అనుబంధాన్ని కుటుంబసభ్యులతో గుర్తు చేసుకున్నారు. పలువురు నాయకుల ఇళ్లకు వెళ్లిన మాజీ మంత్రి తేనేటీ విందును స్వీకరించారు. ఆమె వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజునాయక్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

అండగా ఉంటాం: ఎంపీ


బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ డీకే అరుణ

కేశంపేట: ఇటీవల అనారోగ్యంతో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ నర్సింహాయాదవ్ తల్లి మృతి చెందింది. విషయం తెలుసుకున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మంగళవారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో నర్సింహాయాదవ్‌తో పాటు కుటుంబసభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ప్రతీ కార్యకర్తకు, నాయకులకు పార్టీ అండగా ఉంటుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంచుకోట మహేశ్, యుగంధర్, గోపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాజునాయక్, కుమారస్వామి, శ్రీనివాస్, పర్వతాలు, శ్రీహరి, భక్తవత్సల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి తారాబాయి

మొయినాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి తారాబాయి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో తారాబాయి నర్సరీలో పెంచిన మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఒకేరోజు దాదాపు రెండు వేల మొక్కలు పంపిణీ చేశామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద పెరటి గోడలో, ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటి సంరక్షణకు కృషి చేయాలని సూచించారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవంలో భాగంగా మొక్కల పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు కావాల్సిన వివిధ రకాల మొక్కలు నర్సరీల్లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

కొత్తూరు: కొత్తూరు పట్టణం నుంచి కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఏబీవీపీ మండల కన్వీనర్ నరేశ్‌చారి మున్సిపాలిటీ అధికారులను మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కేజీబీవీ హాస్టల్‌కు వెళ్లే రోడ్డు ప్రస్తుతం గుంతలమయంగా మారిందన్నారు. చిన్నపాటి వర్షాలకే రోడ్డుపై బురద పేరుకుంటుందని వివరించారు. దీనికితోడు హాస్టల్‌కు వెళ్లే రోడ్డుకిరువైపులా చెట్లు పెరగడంతో రాత్రి వేళల్లో చీకట్లు అలుముకుంటున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో హాస్టల్‌కు వెళ్లేందుకు, హాస్టల్ నుంచి వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి హాస్టల్‌కు వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయడంతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.

సబ్సిడీ దూరం.. ధరలు భారం

- ఏళ్ల నుంచి యంత్రాలకు నిధులు కరువు
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న రైతులు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్నదాతల ఆశలు


బాకారంలో యంత్ర పరికరంతో కలుపుతీస్తున్న రైతు

మొయినాబాద్‌రూరల్: వ్యవసాయ యాంత్రీకరణ పథకం అటకెక్కింది. ఆరేళ్లుగా ఈ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వ్యవసాయంలో యంత్రాల వినియోగాన్ని పెంచి అన్నదాతలకు కూలీల ఖర్చు భారాన్ని, సమయాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకం పత్తాలేకుండాపోయింది. పథకాన్ని మళ్లీ పునఃరుద్ధరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం మాత్రం సబ్సిడీ యంత్రాలు, పరికరాలు అందించడం లేదు. దీంతో రైతులు ప్రైవేటులో కొనలేక ఆందోళన చెందుతున్నారు.

పెట్టుబడి భారం ఎక్కువ

జిల్లాలో ఆరేళ్లుగా రైతులకు సబ్సిడీ యంత్రాలు, పరికరాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి సహాయం కరువైంది. దీంతో వర్షాలు సంవృద్ధిగా కురుస్తున్నా అన్నదాతలకు పరికరాల కొనుగోలు ఆర్థికభారం అయ్యింది. కూలీల ధరలు పెరగడంతో యంత్రాల ద్వారా కలుపుతీత, భూమి సాగు, మందు పిచికారీ ఎంతో లాభదాయకంగా మారినా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో యంత్రాల సబ్సిడీకి మంగళం పలకడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది పంటలకు రైతులకు సబ్సిడీపై అందించే యంత్ర పరికరాలు అందించే విధంగా ప్రభుత్వం చూడాలని రైతులు కోరుతున్నారు. గతంలో 2017 వరకు ఏటా రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు అందేవి. ఆ తర్వాత 6 సంవత్సరాలు అవుతున్నా బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతుల ప్రభుత్వం అని చెప్పుకున్నా అప్పట్లో పనిముట్లు కనుమరుగయ్యాయి. రైతులకు సబ్సిడీపై ఎలాంటి పరికరాలు అందడం లేదు.

రాయితీ పరికరాలపై గంపెడు ఆశలు..

కూలీల ఖర్చులను తగ్గించడంతో పాటు సమయాన్ని ఆదా చేసుకునేందుకు రైతులు అధికంగా యంత్రాలపై ఆధారపడుతుంటారు. ప్రతి ఏటా మార్చి నుంచి ఆర్థిక సంవత్సరం కాగా గడువులోగా కేటాయించిన నిధుల ఖర్చు చేయాల్సి ఉంటుంది. రిజర్వేషన్ల వారీగా రైతులకు ట్రాక్టర్లను మండలానికి కేటాయించేవారు. తదుపరి మీసేవ ద్వారా దరఖాస్తులను స్వీకరించడం, జిల్లా కమిటీల ద్వారా రైతులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి ఆమోదం తెలిపి కలెక్టర్ అనుమతితో రైతులకు ట్రాక్టర్లను అందజేయాల్సి ఉంటుంది. అదేకాకుండా రైతులు పంటలు పండించేందుకు పరికరాలు కూడా సబ్సిడీ ద్వారా పంపిణీ చేసేవారు. 2017 ఆర్థిక సంవత్సరంలో కేటాయించినా అప్పటి ప్రభుత్వ నిధులను నాలుగు విడతలుగా మూడు నెలలకొకసారి నిధులు విడుదల కావాల్సి ఉండగా ఇంతవరకు అతీ గతి లేదు.

బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు..

వ్యవసాయ రంగానికి కావాల్సిన పరికరాల ధరలు ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఏటా ధరలు పెరుగుతుండగా నియంత్రణ లేకపోవడం దారుణ పరిణామం. గతంలో రోటోవేటర్ ద్వారా 80 వేలు ఉండగా ప్రస్తుతం లక్ష దాటింది. కల్టివేటర్ ధర 24 వేలు ఉండగా ప్రస్తుతం 40–50వేలకు చేరగా కలుపుతీసే యంత్రం 40 వేలకు చేరింది. తైవాన్ స్ప్రేర్ మిషన్ 18 వేలు ఉండగా ప్రస్తుతం 30 వేలకు చేరిందిన రైతులు వాపోతున్నారు. అలాగే వ్యవసాయ సబ్సిడీ పరికరాల్లో ఎస్సీ, ఎస్టీలకు రాయితీ గరిష్ఠంగా ఉండేది. ఇతర వర్గాలకు గతంలో మాదిరిగానే ఉండేది. ప్రస్తుతం రెండు లక్షల లోపు యంత్రాలకు ఏడీఏ పరిధిలో రెండు లక్షలు దాటితే జిల్లా కమిటీ పరిధిలో లబ్ధిదారులకు ఎంపిక చేయాల్సి ఉండేది. మొత్తంగా 50 శాతం రాయితీలో కాంట్రాక్టర్లు తదితర పరికరాలు అందజేసేవారు. అప్పట్లో మ్యాన్యువల్ దరఖాస్తులతో అక్రమాలు చోటు చేసుకోవడంతో 2016 నుంచి మీ సేవ ద్వారా ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. సదరు విధానంలో దరఖాస్తులను స్వీకరించాల్సి ఉండగా నిధులురాక రైతులు బహిరంగ మార్కెట్‌లో ట్రాక్టర్లు, ఇతర పరికరాలు కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారు.

పరికరాలు అందడం లేదు



వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు గతంలో పనిముట్లను సబ్సిడీపై అందజేసేవారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 6 సంవత్సరాల నుంచి రాయితీ పరికరాలను ఇవ్వడం ఆపేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో పరికరాలు రైతులకు అందించేవారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో రైతులు ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్నారు. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం రాయితీలకు పరికరాలు అందించేవారని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో సబ్సిడీ పరికరాలు అందిస్తారని ఎదురుచూస్తున్నారు.

– వెంకట్‌రెడ్డి, రైతు, సురంగల్

ధరలు ఎక్కువగా ఉన్నాయి..



ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో కూలీలను సమయాన్ని తగ్గించుకోవడానికి యాంత్రీకరణ తప్పనిసరి. అలాంటి ముఖ్యమైన యంత్ర పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై ఇవ్వడం ఆపేస్తే ఎలా. మార్కెట్‌లో ప్రైవేట్‌గా కొనాలంటే అధిక ధరలతో విక్రయిస్తున్నారు. ఆయా పరికరాల ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా రైతులు వినియోగించే యంత్ర పరికరాలను అందించాలి.

– సైపాల్‌రెడ్డి, రైతు, అమ్డాపూర్

2018 నుంచి సబ్సిడీ రావడం లేదు

ప్రభుత్వం ద్వారా రైతులకు వ్యవసాయ పనిముట్ల కోసం సబ్సిడీలో భాగంగా 2017 వరకు వచ్చాయి. ఆ తర్వాత ఆరేళ్లుగా సబ్సిడీ రావడం లేదు. ఈ విషయంపై రైతుల నుంచి వినతులు వచ్చాయి. ప్రభుత్వం ఎప్పుడు సరఫరా చేసినా రైతులకు అందించేందుకు కృషి చేస్తా.

– ఏఓ రాగమ్మ

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం


లక్ష్మికి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, తదితరులు

షాబాద్: సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామానికి చెందిన జే.లక్ష్మి కొద్దిరోజులుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యాదయ్య ఆస్పత్రికి చేరుకొని లక్ష్మి ఆరోగ్య పరిస్థితి గురించి అగిడి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. లక్ష్మి ఆరోగ్యం మెరుగుపరిచేందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. దీంతో ఎమ్మెల్యే సహకారంతో వైద్యఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.2.50లక్షల ఆర్థికసాయానికి సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే లక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సున్నపు వసంతం, షాబాద్, చేవెళ్ల మండలాల పార్టీ అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, వీరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కుమ్మరి చెన్నయ్య, మాజీ సర్పంచ్‌లు రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, నాయకులు పెంటయ్య, శేఖర్, మహమ్మద్ అహ్మద్ జానీ, జిట్ట శ్రీనివాస్, రవి, కుమార్ తదితరులు ఉన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి


విద్యార్థులతో సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్: విద్యార్థులు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని పట్టణ సీఐ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రవీంద్రభారతీ పాఠశాలలో విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, తద్వారా సమాజ శ్రేయస్సుకు పాటుపడాలన్నారు. కొత్త విషయాలను తెలుసుకోవడానికి ఎప్పుడు ఉత్సాహం, తపనతో ఉండాలన్నారు. లక్ష్యం కోసం పట్టుదలతో శ్రమించాలని సూచించారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలు, ప్రస్తుత సమస్యలు తెలుసుకొని వాటికి పరిష్కారం మార్గం చూపేదిశగా ముందుకు సాగాలన్నారు. అనవసరమైన విషయాలపై ఎక్కువ శ్రద్ధ చూపించి సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. విద్యార్థులు చదువుల్లో రాణించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సుశీల, ప్రిన్సిపాల్ సతీశ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో కార్మికుల నిరసన

బిల్లులు త్వరగా చెల్లించాలని డిమాండ్


కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

కేశంపేట: మధ్యాహ్న భోజన నిర్వహణ కార్మికులు తమకు రావాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ దీక్షలకు సీఐటీయూ సంఘీభావం తెలిపింది. మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులతో కలిసి కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులను చెల్లించడం లేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బేరి శ్రీనివాస్, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు, కార్మికులు సత్తెమ్మ, యాదమ్మ, సబిత, జంగమ్మ, నిర్మల, కై రున్, బాలమణి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ నర్సింహారావు

కొత్తూరు: ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కొత్తూరు సీఐ నర్సింహారావు సూచించారు. పట్టణంలోని మాంటిస్సోరీ ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం ఆయన విద్యార్థులకు సైబర్ నేరాలు, కొత్త నేరచట్టాలు, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, మీకు బంపర్ ప్రైజ్ వచ్చిందని, మీరు పలానా డ్రాలో ఎంపికయ్యారని ఇలా అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు అమాయకులతో పాటు చదువుకున్న వారికి ఫోన్లు చేసి మోసాలకు గురిచేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఇటీవల కాలంలో మాదకద్రవ్యాల వినియోగం కొంతమేర తగ్గిందన్నారు. ప్రభుత్వం వీటి నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన కొత్త నేరచట్టాలు అన్ని అమల్లోకి వచ్చాయన్నారు. గతంలో ఉన్న చట్టాల కంటే ప్రస్తుత చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయన్నారు. ఏ ఒక్కరూ నేరాలకు పాల్పడకుండా శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జే.సుదర్శన్‌గౌడ్, ఎస్‌ఐ శ్రీనివాస్, ఇతర సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కమిటీ ఎన్నిక

షాద్‌నగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ స్టార్స్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని శ్రీసాయిరాజా ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ స్టార్స్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా జీ.నారాయణ, ప్రధాన కార్యదర్శిగా రాంచంద్రయ్య, కోశాధికారిగా మంచిరేవుల అశోక్, సభ్యులుగా ప్రదీప్ కుమార్, ప్రశాంత్‌కుమార్, నర్సింగ్‌రావు, నర్సింలును ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సాయికృష్ణ, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, వంశీకృష్ణ, రమేశ్, మల్చలం మురళీ, శివాజీ, పాండురంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదగిరి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


కమిటీ సభ్యులు

రుణమాఫీకి రేషన్‌కార్డు లింకు సరికాదు

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్

షాబాద్: రైతు రుణమాఫీ చేయడానికి రేషన్‌కార్డు నిబంధన తొలగించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ.. రేషన్‌కార్డు నిబంధన తొలగించాలన్నారు. గత పది సంవత్సరాలుగా కొత్తవారికి రేషన్ కార్డును ప్రామాణికం చేస్తే అనేక మంది రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కొన్ని కుటుంబాలు ఉమ్మడిగా కొనసాగుతున్నాయని, అలాంటి కుటుంబాలకు సైతం ఒకే రేషన్‌కార్డు ఉండటంతో ఒకరికి రుణమాఫీ జరిగితే మరొకరికి జరగదన్నారు. ప్రభుత్వం ఒకవైపు పొంతన లేని నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం రుణమాఫీ హామీ నుంచి తప్పుకునేందుకు అనేక సాకులు వెతుకుతున్నట్లు ఆయన ఆరోపించారు. ఈ విషయమై ప్రభుత్వం పునఃరాలోచన చేయాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యానారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి, కార్యదర్శి దోనూరి కృష్ణ తదితరులు ఉన్నారు.

రేషన్‌కార్డు నిబంధన తొలగించాలి

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసేందుకు రేషన్ కార్డును ప్రామాణికంగా చేసుకోవడం విడ్డూరంగా ఉందని కేశంపేట గ్రామ మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లుగా రేషన్‌కార్డుల మంజూరే లేదని గ్రామాల్లో చాలా మందికి రేషన్‌కార్డులు లేవన్నారు. మొదటగా ప్రజలకు రేషన్‌కార్డులను మంజూరు చేయాలన్నారు. రేషన్‌కార్డులతో సంబంధం లేకుండా రుణాలు తీసుకున్న రైతుకు రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ రేషన్‌కార్డులతో సంబంధం లేకుండా రుణమాఫీ జరిగేలా చూడాలని కోరారు.

షరతులు పెట్టడం హేయమైన చర్య

శంకర్‌పల్లి: రాష్ట్రంలో రైతు రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలను సోమవారం విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే రుణమాఫీకి ప్రభుత్వం విధించిన షరతులపై శంకర్‌పల్లి బీజేపీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం పట్టణ అధ్యక్షుడు బీర్ల సురేశ్ మాట్లాడుతూ.. షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.


చేవెళ్ల: మాట్లాడుతున్న గజేందర్‌గౌడ్, తదితరులు

అంగన్‌వాడీలతో చిన్నారులకు మేలు


చేవెళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి, అంగన్‌వాడీ టీచర్లు

ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి

చేవెళ్ల: అంగన్‌వాడీలకు పిల్లలను పంపించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని తల్లిదండ్రులకు ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలోని అంగన్‌వాడీ 1, 2 కేంద్రాల పరిధిలో మంగళవారం 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి అమ్మ మాట అంగన్‌వాడీ బాట అంటూ నినాదాలు చేశారు. అనంతరం అంగన్‌వాడీలలో తల్లిదండ్రులు, మహిళలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగానే పిల్లల బంగారు భవిష్యత్‌కు అంగన్‌వాడీలు బాటలు వేసే దిశగా కృషి చేస్తోందన్నారు. చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో విద్యాబోధన నిర్వహిస్తున్నారని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్పులు చేస్తుండటం శుభపరిణామం అన్నారు. పిల్లలను అంగన్‌వాడీలకు పంపించి వారి భవిష్యత్‌కు మార్గం చూపించాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ఉమారాణి, ప్రవీణ, అంగన్‌వాడీలోని తల్లులు, మహిళలు పాల్గొన్నారు.

కొందుర్గు: జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని సీహెచ్ తండా, కొందుర్గులో మంగళవారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులతో కలిసి గ్రామంలో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి విద్య ఆవశ్యకతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వసంత, పుష్ప, సోన, అంజమ్మ, శివమ్మ, యామిని, భాగ్య, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలు

ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి

- ఆందోళన చెందుతున్న రైతులు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు


చందానగర్‌లో శిథిలావస్థకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె


సురంగల్‌లో కూలడానికి సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

మొయినాబాద్: ఎప్పుడో ఏళ్ల క్రితం నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలు శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. అసలే వర్షాకాలం కావడంతో ఎప్పుడు దిమ్మెలు కూలుతాయోనని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం ఇలాంటి వాటిని పట్టించుకోవడం లేదు. మండలంలోని చందానగర్, సురంగల్ గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. కొన్ని రాళ్లు ఊడిపడి కూలిపోయే స్థితికి చేరాయి. చందానగర్ గ్రామంలో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఈ పరిస్థితి ఉండటంతో దిమ్మె కూలి ట్రాన్స్‌ఫార్మర్ కిందపడితే విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అదేవిధంగా సురంగల్ గ్రామ శివారుల్లోని వ్యవసాయ పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె సైతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇది కూడా ఎప్పుడు కూలుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వీటిపై విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దిమ్మెలకు మరమ్మతులు చేయించి ప్రమాదాలను అరికట్టాలని కోరుతున్నారు.